క్లుప్తంగా

నూతన డీటీకి శుభాకాంక్షలు



డీటీకి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలు

పరవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహశీల్దారుగా ఎం.ఎస్.అరుణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా పని చేసిన సురేష్‌కుమార్ అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో పని చేసిన అరుణ్‌కుమార్ బదిలీపై పరవాడ డీటీగా వచ్చారు. డీటీగా బాధ్యతలు చేపట్టిన అరుణ్‌కుమార్‌కు మండల వీఆర్‌వోల సంఘ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీటీ అరుణ్ కుమార్ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి పార్థసారథి



మంత్రి పార్థసారథికి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కె. పార్థసారథి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు ఏఈవో ఆనంద్‌కుమార్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పేద విద్యార్థులకు పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న అభయం సొసైటీ ప్రతినిధులు

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో చదువుతున్న తండ్రిలేని పేద విద్యార్థులకు అభయం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఆసరా పథకం పేరుతో రూ.80వేల విలువైన పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు, అభయం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు గణేష్, కల్యాణ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

- రైతులను కలవరపెడుతున్న విష సర్పాలు
- పొలం పనుల్లో ఉండగా కాటు వేస్తున్న పాములు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

అప్రమత్తతే.. శ్రీరామరక్ష

పరవాడ: వానా కాలం వచ్చేసింది. పంట పొలాల్లో పాముల బెడద అధికంగా ఉంటుంది. నిత్యం వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల్లో తిరుగాడే రైతులు పాముల పట్ల జాగ్రత్తగా వ్యవహరించడం చాలా ముఖ్యం. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాము కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. పరవాడ మండలంలో ఏడాది క్రితం నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామానికి చెందిన గండిమాని దేముడు పాముకాటుకు గురై మృతి చెందాడు. అదే గ్రామంలో 6 నెలల క్రితం బండారు లక్ష్మి అనే మహిళ ఇంటి వద్ద కంపలు తీస్తుండగా పాము కాటుకు గురైంది. కంపల్లో మాటు వేసిన గుర్తు తెలియని పాము చేతిపై కాటు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడి చేతిపై పెద్ద గాయంతో బాధపడుతోంది. గత నాలుగేళ్ల వ్యవధిలో పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 52 మంది వివిధ విష జీవుల బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. దీనిని బట్టి విషజీవుల పట్ల ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే అని తెలుస్తోంది.

ఖరీఫ్ సీజన్‌లో అప్రమత్తం..

ఏటా జూలై నుంచి సెప్టెంబరు వరకు ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారు. వరి పంట వేయడంతో పాటు రాత్రి వేళ పంట పొలాలకు నీరు పెట్టడం వంటి పనుల్లో నిమగ్నమై ఉంటారు. ఈ సీజన్‌లో పాములు, విష పురుగుల సంచారం అధికంగా ఉంటుంది. పంట పొలాల్లో గడ్డి అధికంగా మొలవడం, పంట చేలు ఏపుగా పెరగడంతో ఎక్కడ ఎలాంటి విష పురుగులు ఉంటాయో గుర్తు పట్టడడం కష్టంగా ఉంటుంది. కనుక పాములు, విష పురుగుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించడం ఎంతైనా అవసరం. ఏపుగా పెరిగిన విష పూరిత పాములు చేలల్లో సంచరిస్తుంటాయి. కప్పలు, ఎలుకలు, ఇతర కీటకాలను తినడానికి సంచరిస్తుంటాయి. ఎలుకలు పంట పొలాల గట్లపై ఏర్పాటు చేసిన కలుగుల్లో పాములు మాటు వేసి ఉంటాయి. అటువంటి సమయంలో అప్రమత్తంగా ఉంటూ అటువంటి సమయంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే నిర్లక్ష్యం వహించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.

పాము కాటు లక్షణాలు..

పాము కాటు వేస్తే శరీరంపై రెండు, నాలుగు కామా ఆకారపు గుర్తులు పడతాయి. అర గంటలోపు విషం శరీరం అంతా పాకి నాడీ వ్యవస్థపై ప్రభావరం చూపుతుంది. కళ్లు మూతలు పడడం, నోటి నుంచి నురగ రావడం, కాళ్లు, చేతులకు పక్షవాతం రావడం, నాలుక మందంగా మారి మాట పడిపోవడం, గొంతు కండరాలు బిగువుగా మారడం, నొప్పి క్రమంగా వ్యాప్తి చెంది తిమ్మిరిగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్త పింజర వంటి విష పూరిత పాములు కరిస్తే అర గంట వ్యవధిలో నోరు, చెవుల నుంచి రక్త స్రావం జరుగుతుంది.



పాము కరవడంతో నాయుడుపాలెం మహిళ చేతిపై ఏర్పడిన గాయం

23 జాతి పాములే విషపూరితమైనవి..

మనకు కనిపించే అన్ని పాములు విషపూరితమైవి కావని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాటిలో 23 జాతులకు చెందిన పాములే అత్యంత విషం కలిగి ఉంటాయని చెబుతున్నారు. నాగు పాము, రక్త పింజర, కట్ల పాముల వలన ప్రమాదం పొంచి ఉందని సూచిస్తున్నారు. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయించుకుంటే ప్రమాదం నుంచి బయట పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు..

రాత్రివేళల్లో పొలాలకు వెళ్లే రైతులు కాళ్లకు పొడవాటి బూట్లు, చేతులకు గ్లౌజులు ధరించాలి. చేతి కర్రతో శబ్దం చేస్తూ టార్చిలైట్ వెంట తీసుకుపోవడం ద్వారా పాముల బారిన పడకుండా ప్రమాదాల నుంచి బయట పడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

యాంటీ స్నేక్ వీనమ్ నిల్వలు

పరవాడ పీహెచ్‌సీలో - 45

వాడచీపురుపల్లి పీహెచ్‌సీ - 50



పాము కాటుకు ఉపయోగించే ఏఎస్ వ్యాక్సిన్

పాము కరిస్తే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

పాములు కరిస్తే ఆందోళన చెందకూడదు. ఒత్తిడికి గురైతే గుండె పోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పాము కరిచిన భాగంలో గుడ్డతో గట్టిగా కట్టి విషం శరీరం లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గాయం పైన కట్టిన కట్టును 10 నిమిషాలకు ఒక పర్యాయం విప్పి మళ్లీ కడుతూ ఉండాలి. పాము కరిచిన ప్రదేశాన్ని బ్లేడుతో ప్లస్ ఆకారంలో కోసి విషంతో కూడిన రక్తం బయటికి పోయే విధంగా చూడాలి. రోగికి ధైర్యం చెప్పాలి. గాయంపై ధారాళంగా నీరు పోస్తూ శుభ్రమైన గుడ్డతో గాయాన్ని తుడవాలి. పసర్లు, నాటు వైద్యంపై ఆధారపడకుండా సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) వ్యాక్సిన్ వేయిస్తే ప్రాణాపయం నుంచి బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

పాముల పట్ల అప్రమత్తం..



పాముల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యంగా రైతులు వీటి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. పాము కరిచిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో పాము కాటుకు అవసరమైన యాంటీ స్నేక్ వీనమ్ మందు అందుబాటులో ఉంటుంది. పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ జయశ్రీ కరిష్మా, ప్రభుత్వ వైద్యాధికారి, పరవాడ

సింహగిరిపై ప్రసాదాల తయారీ శాల పరిశీలన



అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై ప్రసాదాల తయారీకి నూతన శాల నిర్మాణానికి శనివారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం అన్న ప్రసాద భవనంపై అంతస్తుని ప్రసాదాల తయారీ వంటశాలతో పాటు లడ్డూలు చుట్టేందుకు, పులిహోర పంపిణీకి వినియోగిస్తున్నారు. దీంతో కింది అంతస్తులో భక్తులు అన్నప్రసాదం స్వీకరించేందుకు సరిపోవడం లేదు. ఈ తరుణంలో కొత్తగా భవనం నిర్మించి అందులోకి ప్రసాదాల తయారీ, ప్యాకింగ్ సెక్షన్లను మార్చు చేసేందుకు కొన్నిరోజుల కిందట ప్రణాళిక వేశారు. ఈ మేరకు భవనం నిర్మించేందుకు అనువైన స్థలం కోసం ఈవో అధికారులతో కలిసి పరిశీలన చేశారు. త్వరలోనే కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు. అన్నప్రసాద భవనంలో భక్తులకు అందుతున్న సేవలను పరిశీలించారు. భక్తులతో సిబ్బంది మర్యాద పూర్వకంగా మాట్లాడాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యూలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని తెలిపారు. వంట పదార్థాలు తయారు చేసేటప్పుడు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, పి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీఈ హరి, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విత్తన బంతుల తయారీ



విత్తన బంతులు తయారు చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: అంకురానికి విద్యార్థులు స్వేదం చిందించారు. మట్టిలో రేపటి పచ్చదనం ఉంచి ఉండలుగా చుట్టారు. బంతులతో ఆడుకునే విద్యార్థులు విత్తన బంతులు తయారు చేశారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థులు విత్తన బంతులు చేసే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే గణబాబు విత్తన బంతులు తయారు చేసే విధానాన్ని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. రేపటి తరానికి పచ్చదనం అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కలిసి సుమారు 20వేల విత్తన బంతులు తయారు చేశారు. జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూరి అను మాట్లాడుతూ వీటిని వర్షా కాలంలో కొండలు, ఖాళీ స్థలాలు, రిజర్వాయర్ గట్లపై వేస్తామని చెప్పారు. విత్తన బంతుల్లో సీతాఫలం, బొప్పాయి, గంగరావి, సపోటా, నేరేడు, పనస, చింత, వేప, కుంకుడు, తురాయి, రేగు తదితర విత్తనాలు ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, వై స్వర్ణలత, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మజ్జూరి శ్రీనివాసరావు, వైఎస్ ప్రసాద్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లఘు ఉద్యోగ్ భారతి జిల్లా కమిటీ కార్యవర్గం ఎన్నిక



లఘు ఉద్యోగ్ భారతి నూతన కార్యవర్గం

గాజువాక: విశాఖ జిల్లా లఘు ఉద్యోగ్ భారతి నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం ప్రతినిధులు శనివారం ఎన్నుకున్నారు. గాజువాక ఆటోనగర్‌లో నిర్వహించిన ప్రతినిధులు సమావేశంలో జిల్లా కమిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జగపతి రాజు, పవన్‌జైస్వాల్, కోశాధికారిగా వరుణ్, ఉపాధ్యక్షుడిగా సత్య, సంయుక్త కార్యదర్శిగా నాగిరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తల సమస్యలపై చర్చించారు. జిల్లా చాప్టర్ మాజీ అధ్యక్షుడు అట్లూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు ఐపీ నిపుణులు పాల్గొన్నారు. పరిశ్రమలు ఖాయిలా పడే పరిస్థితుల్లో ఉన్నప్పుడు పారిశ్రామికవేత్తలు ఐపీ పెట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐపీ నిపుణులు విశ్వనాథశర్మ, నరేందర్‌రెడ్డి, సుజాత వివరించారు. ప్రభుత్వం, బ్యాంకుల మధ్య మధ్యవర్తిత్వం చేసి పరిస్థితుల నుంచి బయటపడేలా సహకరిస్తామని పేర్కొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.హేమలత అధ్యక్షతన, వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఆర్‌సీ-5 యు.సుభ, దాతల చేతుల మీదుగా పది మంది విద్యార్థులు, ఇద్దరు దివ్యాంగులకు నగదు పురస్కారాలు, నోట్ పుస్తకాలు, పెన్‌లు పంపిణీ చేశారు. వనితా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభ శర్మ ఆరు నుంచి పదో తరగతి వరకు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రూ.10 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలపై వివాదం

పారదర్శకత లోపించిందని అసోసియేషన్ ఆరోపణ

మహారాణిపేట: నగరంలో జరుగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బదిలీల్లో విధానపరమైన లోపాలు ఉన్నాయని, పారదర్శకత లోపించిందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మర్రి శేషుబాబు ఆరోపించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా జరగాల్సిన బదిలీలు.. కొందరు అధికారుల ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితా విడుదల చేయకుండానే బదిలీలు ప్రారంభించడం అన్యాయమని శేషుబాబు అన్నారు. న్యాయ బద్ధంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: గిరి ప్రదక్షిణ సందర్భంగా 11 కేవీ ధారపాలెం ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. అడవివరంలోని కుమ్మరిదిబ్బ, పాత అడవివరం జంక్షన్, ధారపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు



ధర్మాల శ్రీనును సత్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా... సమస్యలను పక్క దారి పట్టించేలా చేస్తున్న విధానాలను ప్రజలకు వివరించాలని 64వ వార్డు అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ ధర్మాల శ్రీను అన్నారు. 64వ వార్డు అధ్యక్షునిగా నియమించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను గంగవరం గ్రామంలోని సాయిబాబా ఆల యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి పాటు పడతానని చెప్పారు. అనంతరం రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో అమ్మోరు, పితాని అన్నవరం, కొవిరి బాపనయ్య, కదిరి సత్తెయ్య, డీఎల్‌బి నూక రాజు, కొవిరి ఆది, కంబాల మల్లేశ్వర రావు, సింగపూర్ రాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కదిరి భూలోక తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కేవీలో ‘తల్లి పేరుతో వృక్షం’



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-1లోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం తల్లి పేరుతో వృక్షం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ పథకంలో భాగంగా మొక్కలు నాటారు. వాటిని తమ తల్లుల పేరుతో అంకితం చేశారు. ఈ మేరకు మొక్కల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ మాట్లాడుతూ తల్లుల పేరుతో పిల్లలు మొక్కలు నాటడం గొప్ప కార్యక్రమం అన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిధిలో మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాభారతిలో నేడు చతుర్గుణిత అష్టావధానం



ద్విశతావధాని బులుసు అపర్ణ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విశ్వనాథ సాహితీ పీఠం సంయుక్తంగా ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో అరుదైన చతుర్గుణిత అష్టావధానాన్ని నిర్వహించనున్నాయి. ప్రఖ్యాత ద్విశతావధాని బులుసు అపర్ణ ఈ అవధానాన్ని నిర్వహిస్తారు. 30 ఏళ్ల తరువాత విశాఖలో జరుగుతున్న మొట్టమొదటి భారీ సాహితీ కార్యక్రమం ఇదేనని వీఎండీఏ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. సాధారణ అష్టావధానంలో ఎనిమిది మంది పృచ్ఛకులు ఉంటారు. అయితే, చతుర్గుణిత అష్టావధానంలో ఒకేసారి నాలుగు అష్టావధానాలు జరుగుతాయి. అంటే వేదికపై మొత్తం 32 మంది పృచ్ఛకులు ఉంటారు. ఇది అత్యంత కష్టతరమైన సాహితీ ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ పేరి రవికుమార్ పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. సాహితీ, సంగీత, సాంస్కృతిక ప్రియులందరూ ఈ నూతన ప్రక్రియను వీక్షించి ఆనందించాలని డాక్టర్ రాంబాబు కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



గ్రామంలో డ్రైన్లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణతోనే ఆరోగ్యవంతమైన జీవనం సొంతమవుతుందని జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని గొల్లలపాలెంలో శనివారం ఆయన పర్యటించి గ్రామస్తులకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. డ్రైన్ల నిర్వహణ, పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, సచివాలయ సిబ్బందితో పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోపాడ అప్పారావు, ఎంపీడీవో పి పద్మజ, ఈవోపీఆర్‌డీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు



దివ్య అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వారాహి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శనివారం ఉత్సవమూర్తి వారాహి అమ్మవారికి క్షీరాభిషేకం, శోడషోపచార సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. వారాహి మాతను భూ ఆధారిత పంటలైన దాన్యతల్పం మీద దివ్య అలంకరణ భూషితగా నూతన వస్త్రాలతో ఆలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం రాత్రి లక్ష్య సాధన కోసం లక్ష్య వారాహీ హోమం నిర్వహించగా శనివారం రాత్రి స్వప్నవారాహీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొనడం ద్వారా వారాహీ మాత మనకు స్వప్నంలో దర్శనమిచ్చి అమూల్యమైన సూచనలు చేస్తుందని భక్తుల విశ్వాసం. అదే విధంగా ఆదివారం రాత్రి తిరస్కరిణీ వారాహీ హోమం జరుగుతున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ హోమం ద్వారా మాయా, భ్రాంతుల తొలగింపుతో పాటు ప్రతికూల శక్తుల నుండి రక్షణ కలగుతుందన్నారు. మధ్యాహ్నం గురుమాత అన్నపూర్ణ చేతుల మీదగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

అనకాపల్లి ఎస్‌డీఏవోగా సుబ్రహ్మణ్యం



బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్రహ్మణ్యం

అనకాపల్లి: స్థానిక సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా సీహెచ్.సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఈయన పాడేరు నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన రామారావు శ్రీకాకుళం జిల్లా పలాస బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

మొక్కల పెంపకం అవశ్యం



మొక్క నాటుతున్న బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డులోని అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలోని దేవాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. జగన్నాథస్వామి ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.పద్మావతి పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, సేవా సమితి అధ్యక్షురాలు చిత్తా జానకీదేవి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, ప్రతినిధులు చిత్తా శోభారాణి, రమాదేవి, వెంకటలక్ష్మి, విందుల తులసి, మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు పాల్గొన్నారు.